క్లుప్తంగా

వాసవీ ఆలయం వద్ద సేవా కార్యక్రమాలు



దివ్యాంగులకు వాకింగ్ స్టాండ్‌లను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): వాసవి వనిత ఉమెన్ ఎంపైర్ ఆధ్వర్యంలో గరివిడి వాసవీ ఆలయం వద్ద పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయాస్తమాన సేవ కార్యక్రమంలో భాగంగా చెప్పులు కుట్టుకునే వారికి గొడుగులు, ముగ్గురు దివ్యాంగులకు వాకింగ్ స్టాండులు అందజేశారు. కేన్సర్‌తో బాధపడుతున్న ఒక వ్యక్తికి రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఐఈసీ ప్రతినిధులు కీర్తన, మన్మధరావు, గ్రంధి రవి, ఉప్పల అంబరీష్, సంఘ ప్రతినిధులు వజ్రపు సంతోషి, అమరాశ్యామ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



ఉపాధ్యాయుడు రాంబాబుకు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న దాత

వేపాడ: కరకవలస పంచాయతీలోని గిరిశిఖర మారిక గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశాఖపట్నంలోని మధుర వాడ (కార్ షెడ్) శివ చత్రపతి కలామ్ జూనియర్ కళాశాల డైరెక్టర్ ఎం.సురేష్ కుమార్ రూ.11,500 విలువ చేసే నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ప్లాంక్స్ వితరణ చేశారు. వాటిని పాఠశాల ఉపాధ్యాయుడు తాడి రాంబాబుకు ఆదివారం అందజేశారు. దాతకు ఉపాధ్యాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

సిద్ధమైన నారుమడులు



పురిటిపెంటలో సిద్ధం చేసిన నారుమడి

గజపతినగరం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో భాగంగా వరినారు వేసేందుకు రైతన్నలు నారు మడులను సిద్ధం చేసి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. దుక్కువాన పడినా ఆకు పోయవచ్చని రైతులు చెబుతున్నారున. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రైతులు తమ తమ పొలాల్లో ఆకు మడులను సిద్ధం చేసుకున్నారు.

రోడ్డు పక్కనే చెత్త



మరుపల్లి జాతీయ రహదారి సమీపంలో వేసిన చెత్త

గజపతినగరం: మండలంలోని మరుపల్లిలో రహదారి పక్కనే చెత్త వేయడంతో దుర్వాసన వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారున. చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు చెత్తంతా జాతీయ రహదారికి ఇరువైపులా వేసేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త సేకరించి, చెత్త సంపద కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గజపతినగరంలో వర్షం

గజపతినగరం: మండల కేంద్రంతో పాటు కొత్త శ్రీరంగరాజపురం, మధుపాడ, ఎం.వెంకటాపురం, ఎస్‌జీఆర్‌పురం, తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌కు ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

అవమానించడం సరికాదు

విజయనగరం గంటస్తంభం: అధికారం ఉందనే అహంతో ఎవరిని పడితే వారిని అవమానించడం సరికాదని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు ఖండించారు. కర్నూలు జిల్లా, ఆదోని మండలం, దాణాపురంలో దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను ఉద్దేశించి, బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నేత జి.కృష్ణమ్మలు ఎస్సీ అని సంబోధించి, వారు పాల్గొనే కార్యక్రమంలో వేదికపై చోటు ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. ఆయన ఎస్సీ అని, తమ కాళ్ల వద్ద నిల్చోవాలని వారు సూచనప్రాయంగా చెప్పడం దానికి తగ్గట్టుగా వారి వ్యవహారం ఉండడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోందన్నారు. అధికారం ఉందని రెచ్చిపోవద్దని, కులవివక్ష చూపొద్దని తెలిపారు. అందరూ సమానమేనన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.

సంపద తయారీ ఎక్కడ..?

- నిరుపయోగంగా సంపద కేంద్రాలు
- నిర్వహణపై దృష్టి సారించని అధికారులు



కాలంరాజుపేట సంపద కేంద్రంలో నిల్వచేసిన కలప



పిడిశీలలోని చెత్త సంపద కేంద్రం

గజపతినగరం రూరల్: చెత్త నుంచి సంపద తయారు చేయాలన్న ఉద్దేశంతో 2014 – 19 సమయంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి హామీ నిధులతో అట్టహాసంగా షెడ్లను నిర్మించారు. ఆ సమయంలో ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ. 3 లక్షల వరకు కేటాయించారు. మండలంలోని 30 పంచాయతీలలో 26 సంపద కేంద్రాలను నిర్మించారు. అయితే కేంద్రాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించకపోవడంతో మండలంలోని సుమారు 70 శాతం కేంద్రాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి.

కానరాని చెత్త శుద్ధి..

అప్పట్లో టీడీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద కేంద్రాల కోసం విశేషంగా ప్రచారం చేసిన విషయం అందరికీ తెలిసిందే. గ్రీన్ అంబాసిడర్లను నియమించి వారి ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఈ షెడ్లలో నిల్వ ఉంచేవారు. కొద్ది రోజుల తర్వాత తయారైన వర్మీకంపోస్టును కిలో రూ.10లు చొప్పున రైతులకు అమ్మి పంచాయతీ అభివృద్ధికి వినియోగించేవారు. అయితే కేంద్రాల నిర్వహణను అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో సంపద మాట పక్కనబెడితే ఉన్న కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయని పలువురు చెబుతున్నారు.

మండలంలో...

గజపతినగరం, పురిటిపెంట, మరుపల్లి, మధుపాడ వంటి నాలుగు గ్రామాల్లో సంపద కేంద్రాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించారు. మిగిలిన గ్రామాల్లోని సంపద కేంద్రాలు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. గంగచోళ్లపెంట గ్రామంలో సంపద కేంద్రం గోడ కూలిపోయి సంవత్సరాలు గడుస్తున్నా పట్టించు కోవడం లేదు. అలాగే మర్రివలసలో సంపద కేంద్రం బీటలు వారింది. మిగిలిన గ్రామాల్లోని షెడ్లు వాటి పూర్వ స్వభావాన్ని కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మరికొన్ని గ్రామాల్లో స్థానికులు ఆయా కేంద్రాల్లో కలపను, ఇతర సామగ్రిని నిల్వ చేసుకుంటున్నారు. ఈ విషయమై పంచాయతీ విస్తరణాధికారి సుగుణాకరరావుకు పలుమార్లు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం. ఎంపీడీఓ కల్యాణి వద్ద సాక్షి ప్రస్తావించగా సంపద కేంద్రాల నిర్వహణ బాధ్యత పంచాయతీ విస్తరణాధికారులేదనని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సంపద కేంద్రల నిర్వహణపై దృష్టి సారించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పట్టించుకోవడం లేదు

గ్రామంలోని చెత్త సంపద కేంద్రం పూర్తిగా నిరుపయోగంగా మారింది. అధికారులకు పలుమార్లు చెప్పినా ఫలితం లేకపోతోంది. అధికారుల తీరు వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సందప కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి.

– గేదెల రమణ, కాలంరాజుపేట

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

జామి: మండలంలోని పావాడ గ్రామంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత నేత పత్రి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ బడుగు,బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కొనియాడారు. ఆమహనీయుని ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని, రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలని అన్నారు. దళిత నాయకుడు ఆతవ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రం ఎస్.కోటలో అంబేడ్కర్ విజ్ఞాన మందిరం నిర్మించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, స్థానిక సర్పంచ్ జాగరపు జ్యోతి, పీరుబండి జైహింద్‌కుమార్, ఆర్.పైడి బాబు, జి.అప్పా రావు, బోని కృష్ణ, ఆతవ ఉదయ్‌భాస్కర్,కంత వేణు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ధర్నా



డెంకాడ మండలం, మోదవలస పంచాయతీ పరిధిలోని ఆర్ట్ గ్యాలరీ ఎదురుగా ఉన్న శుభగృహ అవంతిక లేఅవుట్ వద్ద రైతులు ఆదివారం ధర్నా చేపట్టారు. తమ భూములు తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ కనకల రామారావు మాట్లాడుతూ శుభగృహ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు మోదవలసలో లే అవుట్ వేసేందుకు రైతుల నుంచి 4 ఎకరాల భూమిని తీసుకున్నారన్నారు. అప్పట్లో అదే లేఅవుట్‌లోని రైతులకు వారిచ్చిన భూమిలో 50 శాతం భూమి ఇచ్చేందుకు శుభగృహ సంస్థ వారు ఒప్పుకున్నారని గుర్తు చేశారు. ఇప్పటికి పది సంవత్సరాలైనా ఆ ఒప్పందం నెరవేర్చే దిశగా ఆ సంస్థ వారు ఆలోచన చేయడం లేదన్నారు. దానిపై నిలదీస్తే డబ్బులిచ్చేస్తామని చెబుతున్నారని, ఇది అన్యాయం కాదా అని ప్రశ్నించారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని మాజీ సర్పంచ్ తెలిపారు.

– డెంకాడ

రక్తదానం.. ప్రాణదానం



శిబిరం వద్ద రక్తదానం చేస్తున్న యువకులు

విజయనగరం గంటస్తంభం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకురావాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. మాతృసేవా సంఘం వ్యవస్థాపకుడు ఇప్పలవలస గోపాలరావు పుట్టినరోజు సందర్భంగా స్థానిక గురజాడ గ్రంథాలయంలోని చాసో భవనంలో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. పలువురు దాతలు శిబిరానికి హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం దానం చేస్తే శారీరకంగా క్షీణించిపోయి ఆరోగ్యం దెబ్బతింటుందనే అపోహ అందరిలో ఉందన్నారు. మనమిచ్చే రక్తం ఎంతమంది ప్రాణాలు కాపాడుతుందోనన్న విషయం గుర్తెరగాలన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానానికి వచ్చి ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని కోరారు. జిల్లాలో తలసేమియా, హెచ్ఐవీ బాధితులు, రోడ్డు ప్రమాదానికి గురై అత్యవసర ఆపరేషన్ల కోసం రక్తం అవసరమైన వారికి గోపాలరావు రక్తం అందేలా ఏర్పాట్లు చేస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్ కలామ్ స్వచ్ఛంద సంస్థ జాతీయ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, ఎన్‌వీఎస్ బ్లడ్‌బ్యాంక్ అధినేత తాడేపల్లి నాగేశ్వరరావు, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శర్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సత్యారావు ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బొంతు సత్యారావును మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం పరామర్శించారు. సత్యారావు ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న బడ్డుకొండ అప్పలనాయుడు ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్ అంబళ్ల కిరణ్, ఎంపీటీసీ సభ్యుడు బొంతు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిరండి



జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు

చీపురుపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అన్ని నియోజకవర్గాల ఇంచార్జ్‌ల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు చేపడుతున్న యువతపోరు కార్యక్రమంలో యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనువాసులనాయుడు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంటు డబ్బులు చెల్లించలేదని, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి హామీలు అమలు చేయలేదన్నారు. 20లక్షల మందికి ఉద్యోగాలు, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చారని, తొలి ఏడాది నిరుద్యోగ భృతి జాడే లేదని మండిపడ్డారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా చంద్రబాబు విద్యార్థులతో పాటుగా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు.

యువతపోరుకు హాజరుకావాలి



యువతపోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల యువజన అధ్యక్షుడు దత్తి చిరంజీవి, తదితరులు

దత్తిరాజేరు: నిరుద్యోగులను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం కోసం జిల్లా కేంద్రమైన విజయనగరంలో సోమవారం చేపట్టనున్న యువత పోరు కార్యక్రమానికి యువత పెద్ద ఎత్తున హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ మండల యువజన అధ్యక్షుడు దత్తి చిరంజీవి పిలుపునిచ్చారు. ఈ మేరకు దత్తిరాజేరు మాజీ సర్పంచ్ ఫణీంద్రుడు ఇంటి వద్ద యువకులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే యువకులకు ఉద్యోగాలు ఇస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకుండా యువతను మోసం చేసిందని ఆరోపించారు. నిరుగ్యోగ భృతి.. ఫీజు రీయింబర్స్‌మెంట్, తదితర హామీలు అమలు చేయలేదని మండిపడ్డారు. నిరసన అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు చెప్పారు.

నిరుద్యోగులకు మోసం..



గంట్యాడ: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విజయ్, వెంకటరావు, తదితరులు

గంట్యాడ: నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కె. విజయ్, ఉపాధ్యక్షుడు పి.వెంకటరావు ఆరోపించారు. మండల పరిధి నరవ గ్రామంలో యువతపోరుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు ఇస్తామన్న భృతి ఎక్కడకు వెళ్లిందని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం కార్యదర్శి రఘుమండ రమణ, మండల కార్యదర్శి పి.వినోద్, రమణ, సన్యాసిరావు, వివేక్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి..



బొండపల్లి: యువతపోరు వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జగదీశ్వరరావు, తదితరులు

బొండపల్లి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించనున్న యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బోడసింగి జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. యువతకు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి ఇప్పటి వరకూ ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. యువతపోరు నిరసనలో యువత పాల్గొనాలని కోరారు.

విత్తన ఎంపికే కీలకం!

- ఖరీఫ్ సాగులో విత్తనాల ఎంపిక ప్రధానం
- కొనుగోళ్లప్పుడే మొలకశాతం చూసుకోవాలి
- నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు
- నియోజకవర్గంలో 28 వేల ఎకరాల్లో సాగు



చౌడువాడ రైతుసేవా కేంద్రంలో సిద్ధంగా ఉన్న విత్తనాలు

పూసపాటిరేగ:

ఖరీఫ్ సాగులో విత్తనాలు ఎంపిక కీలకం. నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకుని వేసుకుంటే ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుంది. కొంచెం మేలురకాలైన విత్తనాలు ఎంపిక చేసుకుని పొలాల్లో చల్లితే చీడపీడలు తట్టుకునే పంటలు అధిక దిగుబడులనిస్తాయి. ముఖ్యంగా నేలసారాన్ని బట్టి అనువైన విత్తనాలు వేసుకుని, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది సలహాల సూచనలు పాటిస్తే సాగులో మంచి లాభాలు ఆర్జించవచ్చు. అయితే సాగు తొలినాళ్లలో చేసే విత్తన ఎంపికలో ఏదైనా పొరపాటు జరిగితే సాగు మొదలుకుని పంట చివరి వరకు శ్రమ, ఖర్చు వృథా తప్ప లాభమేమీ ఉండదు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులంతా పంటల సాగులో తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

ప్రధానంగా వరి, మొక్కజొన్న..

నెల్లిమర్ల నియోజకవర్గంలో పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల మండలాల్లో 28 వేల ఎకరాల్లో వివిధ రకాలైన పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటు పండిస్తున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాకముందే వర్షాలు కురుస్తుండడంతో వరి పంట పండించాలనుకునే రైతులంతా నారుమడులు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. సాగుకు పొలాలు సిద్ధం చేసుకున్న మరికొంతమంది రైతులైతే విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు.

అనుమతి ఉన్న షాపుల్లోనే..

వ్యవసాయ శాఖ అధికారుల అనుమతులు ఉన్న షాపుల్లోనే విత్తనాలు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలి. ఇలా అక్కడ కొనుగోలు చేసి వేసుకున్న పంటలో ఏదైనా నష్టం వస్తే సదరు డీలరు బాధ్యత వహించే అవకాశం ఉంటుంది. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లు తీసుకుని, సాగు కాలం పూర్తయ్యే వరకు ఉంచాలి. విత్తనాలు తీసుకునేటప్పుడే సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు పొందాలి. మొలక శాతం సంతృప్తిగా ఉన్న విత్తనాలనే తీసుకుని వేసుకోవాలి. సాగులో ఏదైనా పొరపాటు జరిగితే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలి.

బిల్లులు భద్రపరుచుకోవాలి..

డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా ఆ బిల్లులు భద్రపరుచుకోవాలి. పంట దిగుబడి చివరకు వచ్చే వరకు ఆ బిల్లులు ఉండాలి. సాగు కాలంలో పంట ఏదైనా ప్రమాదంలో ఉన్నట్లు తెలిస్తే వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలి.

–నీలిమ, వ్యవసాయాధికారి, పూసపాటిరేగ

రాయితీపై విత్తనాలు అందివ్వాలి..

ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో రైతులకు సరఫరా చేయాలి. చెదురుమదురుగా వర్షాలు పడుతుండడంతో సాగుభూముల దుక్కులు పూర్తయ్యాయి. రైతులకు వ్యవసాయ సాగుకు అవసరమయ్యే విత్తనాలు అందివ్వాలి.

పి.రామునాయుడు, రైతు, పూసపాటిరేగ

శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత



గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎస్సై సన్యాసినాయుడు

డెంకాడ: శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని ఆర్.తమ్మాపురంలో ఆదివారం జరిగిన పల్లెనిద్ర కార్యక్రమంలో గ్రామస్తులను ఉద్దేశించి, కాసేపు మాట్లాడారు. గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా శాంతియువత వాతావరణం ఉండేలా చూడాలని గ్రామపెద్దలను కోరారు. బెట్టింగ్‌లు, మత్తు పదార్థాలకు బానిసలు కావడం, దొంగతనాలు వంటి చెడు అలవాట్ల బారిన పిల్లలు పడకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా ఎక్కడైనా మద్యంబెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తమ గురువులతో పూర్వ విద్యార్థులు

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో ఆదివారం జరిగింది. 1998 పదో తరగతి బ్యాచ్ అందరూ చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుని సరదాగా గడిపారు. అనంతరం వారి గురువులైన పద్మావతి, సూర్యారావు, సత్యనారాయణమూర్తి, రాజేశ్వరరావు, సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. అలాగే భవిష్యత్‌లో పాఠశాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నారు.. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రవికుమార్, ఉషాకిరణ్, శశిధర్, పీకే నరసింహం, భారతీదేవీ, శివ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.